

గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్



సంస్కృతి ఉట్టిపడేలా..



గణతంత్ర దినోత్సవ సందేశాన్నిస్తున్న కలెక్టర్

రానున్న ఐదేళ్లలో జిల్లా తలసరి ఆదాయం రెట్టింపు

గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ టీఎస్ చేతన్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

## జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో

# నిలుపుదాం..

పుట్టపర్తి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో జిల్లా తలసరి ఆదయం రెట్టింపు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పుట్టపర్తిలోని శిరసాని హిల్స్ పోలీస పరేడ్ మైదానంలో వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆవిష్కరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ప్రతి నియోజకర్గానికి పారిశ్రామిక పార్కు, ప్రతి కుటుంబంలో వ్యవసాయ శాస్త్రవేత్తను తయారు చేయడం, ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి చేసుకుందామన్నారు. జిల్లా తలసరి ఆదాయం పెంచడానికి ప్రణాళికలు తయారు చేసినట్లు వివరించారు. జిల్లాలో సాధించిన, చేపట్టబోయే ప్రగతి అంశాలపై కలెక్టర్ నివేదించారు.

### ఆకట్టుకున్న శకటాలు

అంతకు మునుపు జిల్లా ఎస్పీ రత్న, జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి పరేడ్‌లో సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన ప్రగతి శకటాలు ఆకట్టుకున్నాయి. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ సంక్షమ పథకాలపై శకటాలను ఆయాశాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శకటాలు ప్రదర్శించారు. పోలీసు జగిలాలు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. సాయుధ దళాల నుంచి కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న గౌరవ వందనం స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో విశిష్ట సేవలందించిన జిల్లా, డివిజన్, క్షేత్రస్థాయి అధికారులకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఆర్వో విజయసారధి, జిల్లాస్థాయి అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కూటమి నేతలు, ప్రజలు పాల్గొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు గాజుల నరసయ్య కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ ఆత్మీయ సత్కారం చేశారు.



మొదటి బహుమతి పొందిన అన్న క్యాంటీన్ శకటం



రెండో బహుమతి పొందిన జిల్లా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శకటం



వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె



పోలీసు జాగిలం విన్యాసం

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ధర్మవరం జీవనజ్యోతి పాఠశాల, జగరాజుపల్లి కేజీవీబీ, కదిరి గిరిజన సంక్షేమ పాఠశాల, బుక్కపట్నం డైట్ కళాశాల, గోరంట్ల విద్యార్థుల బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి చాటాయి.

### ఉత్తమ శకటాలకు బహుమతులు

గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వ శాఖలకు చెందిన ప్రగతి శకటాల ప్రదర్శనతోపాటు స్టాల్స్ ఆకట్టుకున్నాయి. శకటాల్లో హిందూపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. జిల్లా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, డ్వామా శకటాలకు వరుసగా రెండు, మూడు స్థానాలు దక్కాయి.



రాజ్యాంగ పీఠిక నమూనా వద్ద కలెక్టర్, జేసీ, ఎస్పీ

### ప్రత్యేక ఆకర్షణ.. రాజ్యాంగ పీఠిక

గణతంత్ర వేడుకల్లో భాగంగా పుట్టపర్తిలోని పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ పీఠిక నమూనా ప్రత్యేక ఆర్షణగా నిలిచింది. పైన అశోక చక్రం, చుట్టూ కళాత్మక ఫొటోలు, మధ్యలో భారత రాజ్యాంగ సారాంశాన్ని అందంగా లిఖించారు. ఈ పీఠిక నమూనా వద్ద కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. ప్రజలు, ప్రభుత్వాధికారులు ఈ నమూనా వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి టౌన్



## అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..!

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వినూత్న కార్యక్రమాలు.. రేపు అనంత, కొత్తచెరువులో ప్రజలతో సమావేశాలు

అనంతపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చొరవ చూపుతూ.. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రజల మధ్య సమావేశం ఏర్పాటు చేయిస్తోంది. అనంతపురం నగరంలోని 32వ డివిజన్, శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు బీసీ కాలనీని మొదట ఎంచుకుంది. ఈ నెల 28న రెండు ప్రాంతాల్లోనూ సమావేశాలను నిర్వహిస్తోంది.

- అనంతపురం ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ స్కేటింగ్ మైదానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు సమావేశం మొదలౌతుంది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్, టూటౌన్ సీఐ, డివిజన్ కార్పొరేటర్, డివిజన్‌లోని ముఖ్య నాయకులు హాజరవుతారు.
- కొత్తచెరువు బీసీ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం మొదలవుతుంది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, తహసీల్దారు నీలకంఠారెడ్డి, మండల వ్యవసాయాధికారి నటరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజు, పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రాధ తదితరులు పాల్గొంటారు.




### మౌలిక వసతులే ప్రధాన సమస్య

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఎంచుకున్న రెండు ప్రాంతాలలో మౌలిక వసతులు ప్రధాన సమస్యగా ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చెత్త సేకరణ సరిగా జరడగం లేదు. విద్యుత్ కనెక్షన్లు, వీధి దీపాలు, తాగునీటి ఇబ్బందులు వంటివి ఉన్నాయి. వీటన్నింటిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలను ప్రచురిస్తోంది. సమావేశాలలో ప్రజలు పాల్గొని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి నేరుగా తీసుకువెళ్లేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' వేదికను ఏర్పాటు చేసింది.

ప్రయాణం.. భారం!
అనుకూల సమయంలో ఉన్న రైళ్ల రద్దు 4



## సాయిమార్గమే పరమావధి కావాలి

సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే





మార్చ్‌ఫాస్ట్‌తో సాయికుల్వంత్‌కు వస్తున్న యువత.. వార్షిక నివేదికను విడుదల చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పుట్టపర్తి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి చూపిన ప్రేమ, సేవామార్గమే యువతకు పరమావధి కావాలని శ్రీసత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి నేషనల్ యూత్ లీడర్‌షిప్ సదస్సు మూడోరోజు ఆదివారం కొనసాగింది. కార్యక్రమంలో నిమీష్‌పాండే మాట్లాడుతూ... సత్యసాయిబాబా ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక బోధనలతో మానవాళిని శాంతిజీవనం వైపు పయనించేలా చేశారన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు సత్యసాయి చూపిన మార్గంలో పయనిస్తూ సామాజిక సేవలో పయనిస్తున్నారన్నారు. నేటి యువత సైతం సత్యసాయి మార్గాన్ని అనుసరిస్తూ ఆదర్శ జీవితాన్ని గడపాలని సూచించారు. ఉన్నత విద్య, ధనం, హోదా ఉన్నా.. విలువలు లేకపోతే ఆ జీవితం వ్యర్థమన్న సత్యసాయి బోధనలు పాటించాలన్నారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి యువ సమ్మేళనంపై వార్షిక నివేదికను విడుదల చేశారు. ప్రతిభ కనబరచిన యువతకు చక్రవర్తి సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సదస్సుకు దేశవ్యాప్తంగా 2వేల మంది యువతీయువకులు హాజరయ్యారు.

# ప్రయాణం.. భారం..!

## అనుకూల సమయంలో ఉన్న రైళ్ల రద్దు

ప్రయాణికులకు పెరిగిన చార్జీల ఖర్చు.. ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు

### సమస్య ఇలా..

ప్రతిరోజూ అనంతపురం, ధర్మవరం వెళ్లడానికి అనుకూలమైన సమయంలో ఉదయం 6-40 గంటలకు కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు గుంతకల్లుకు వచ్చేది. ఈ రైలు ఉదయం ఎనిమిదిన్నరకు అనంతపురం, 9-15 గంటలకు ధర్మవరం చేరేది. అలాగే తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు ఉదయం 6 గంటలకు ధర్మవరంలో, ఉదయం 7 గంటలకు అనంతపురం వచ్చి గుంతకల్లుకు 9 గంటలకల్లా వచ్చేది. తిరిగి వెళ్లడానికి తిరుపతి-గుంతకల్లు రైలు ఉపయోగపడేది. ఈ రైళ్లకు ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు అనంతపురం, ధర్మవరం వెళ్లి తక్కువ చార్జీతో తిరిగి వచ్చేవారు. కానీ కుంభమేళా కారణంగా ఈ రైళ్లు రద్దుకావడంతో వారందరికీ సంకట పరిస్థితి ఏర్పడింది. ఈ రైళ్లే కాదు తిరుపతికి వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, హుబ్లీ-తిరుపతి, గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు రైళ్లను కూడా రద్దు చేయడంతో పుణ్యక్షేత్రమైన తిరుమలకు వెళ్లడానికి తగిన రైళ్లులేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముంబై-చెన్నై వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల్లో ప్రయాణించడానికి స్థలం లేక తిరుపతి ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు.




అనంతపురానికి కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్‌లో దివ్యాంగుల బోగీలోకి ఎక్కుతున్న అన్‌రిజర్వుడు జనరల్ టిక్కెట్టు ప్రయాణికులు



గుంతకల్లు/అనంతపురం న్యూటౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా ప్రయాణించే రైళ్లు ఆగిపోవడం వేలాది మందికి కష్టాలు తెచ్చిపెట్టింది. గుంతకల్లు నుంచి అనంతపురం, ధర్మవరం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, దినవారీ పనికి వెళ్లే కూలీల పరిస్థితి రైలు రద్దు కావడంతో తల్లకిందులైంది. ప్రయాగరాజ్ కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ఇక్కడ తిరిగే తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి (నం.57405/06) ప్యాసింజరును, తిరుపతి-గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు (నం. 57403/03), తిరుపతి-హుబ్లీ-తిరుపతి (నం. 57401/02) ప్యాసింజరు రైళ్లను రద్దు చేశారు. గత నెల ఆఖరు నుంచి మార్చి 1వ తేదీ వరకూ ఈ ప్యాసింజరు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో అనంతపురం, తిరుపతికి వెళ్లి వచ్చేవారి సమస్య తీవ్రమైంది. తిరుపతి ప్యాసింజరుకు ప్రత్యామ్నాయంగా మరో రైలు లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు తీవ్రం అయ్యాయి. తక్కువ డబ్బుతో ప్రయాణాలు చేసేవారికి నాలుగింతల చార్జీల భారం పడింది. రైలులో రూ. 40లు ఖర్చు అవుతుండగా బస్సుకు రూ. 300లు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు, ఉద్యోగులు, బడుగుజీవులు వాపోతున్నారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి వెళ్లే రైలు అందుబాటులో లేకుండాపోవడం ఇబ్బందికరంగా మారిందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




### ప్రత్యామ్నాయ రైలే లేదు

ఉదయం గుంతకల్లు నుంచి అనంతపురం వెళ్లే తిరుపతి ప్యాసింజరు రైలు రద్దు కావడంతో వేరే ఎక్స్‌ప్రెస్ రైలుకు వెళ్లే అవకాశాలు కూడా లేకుండాపోయాయి. ఉదయం 6 గంటల నుంచి మొదలుకుని 9 గంటలదాకా మరో రైలు అందుబాటులో లేదు. గతంలో కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు 7 గంటలకు గుంతకల్లుకు చేరుకుని ఐదు నిమిషాలలో బయలుదేరి వెళ్లేది. కానీ రైళ్ల వేగాలు పెరిగిన తర్వాత ఈ రైలు ఉదయం 6 గంటలకు గుంతకల్లుకు చేరేలా సమయాన్ని సవరించారు. ఈ రైలుకు వెళ్లాలంటే అధికధరను చెల్లించడంతోపాటు కూర్చోవడానికి కూడా స్థలం దొరకని రద్దీ ఉంటుంది. పైగా ఉదయం 5 గంటలకు లేస్తే తప్ప ఈ రైలును అందుకోలేరు. ఈ రైలు కాక సోమవారం రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్, బుధ, శుక్రవారాలలో జైపూర్ ఎక్స్‌ప్రెస్, శనివారం ఓకా ఎక్స్‌ప్రెస్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. జనరల్ కంపార్టుమెంట్లు అడుగు పెట్టడానికి కూడా స్థలం లేనంత రద్దీ ఉంటుండటంతో ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్థానికుల ప్రయాణాలకు ఏమాత్రం అనువుగా ఉండవు.



తిరుపతి ప్యాసింజర్

### ఈ రైలు అవసరమా?

అత్యంత ఆవశ్యకమైన గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరును రద్దుచేసిన డివిజనల్ అధికారులు పెద్దగా ప్రాధాన్యం లేని చిగ్జాజుర్-గుంతకల్లు-చిగ్జాజుర్ (నం. 57451/52) ప్యాసింజరు రైలును మాత్రం నడుపుతున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన ఈ రైలును ప్రాధాన్యం లేని బళ్లారి-చిగ్జాజుర్ మార్గంలో వేరే జోన్ పరిధిలోకి నడపాల్సిన అవసరం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ రైలును కనీసం గుంతకల్లు-ధర్మవరం మధ్య తాత్కాలికంగా నడిపినా డివిజన్ కేంద్రంలో, జిల్లా ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి ఈ రైలును జిల్లాలో నడపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

కుంభమేళాకు రైళ్ల మళ్లింపు విషయం ఉన్నతాధికారుల పరిధిలోనిది. వారు ఇచ్చిన ఆదేశాలను మాత్రమే మేము అమలు చేస్తున్నాం. రైళ్ల రద్దుతో స్థానిక ప్రయాణికులకు మాత్రం కొంత ఇబ్బందికరంగానే ఉంది. అయిన కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇక్కడి రైళ్లను అక్కడికి మళ్లించారు. మార్చి 1 నుంచి పునరుద్ధరించే అవకాశం ఉందన్నారు.

**- అశోక్‌కుమార్, స్టేషన్ మేనేజర్, అనంతపురం**

### అనంతపురం వెళ్లాలంటే సమస్యగా ఉంది



జిల్లా కేంద్రానికి వెళ్లేవారికి తిరుపతి ప్యాసింజరు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆ రైలు మూడు నెలలపాటు రద్దుచేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాదాపు వెయ్యి మంది ప్యాసింజరు రైలులో వెళ్లేవారు. గుంతకల్లు-కల్లూరు మధ్యలో ఉన్న చిన్న స్టేషన్ల నుంచి కూడా ఎందరో ఎక్కి పనులకు అనంతపురం, ధర్మవరం వెళ్లేవారు. ఈ రైలును నిలిపివేయడం అందరికీ సమస్యగా మారింది. **-క్రిష్ణయ్య, గుంతకల్లు**

### అనంతపురం ఆసుపత్రికి వెళ్లలేకపోతున్నారు



గుంతకల్లు, సమీప ప్రాంతాలకు చెందిన పేదలు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తిరుపతి ప్యాసింజరు రైలులో వెళ్లేవారు. ఈ రైలు బందయ్యాక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు తక్కువ చార్జీతో జిల్లా కేంద్రానికి వెళ్లే అవకాశం లేకుండాపోయింది. పేద ప్రజల సౌకర్యార్థం వెంటనే తిరుపతి ప్యాసింజరును పునరుద్ధరించాలి.

**-మహమ్మద్ గౌస్, సీపీఐ నాయకుడు, గుంతకల్లు**

### తిరుపతికి వెళ్లడం కష్టంగా మారింది



ప్రసిద్ధ పుణ్య క్షేత్రం తిరుపతికి వెళ్లే రైళ్లన్నింటినీ రద్దుచేశారు. ఎక్కడో జరుగుతున్న కుంభమేళా కోసం ఇక్కడి ప్రజలను ఇబ్బంది పెట్టడం దారుణం. తిరుపతికి వెళ్లడానికి బస్సులు కూడా తగినన్ని లేవు. కనుక ఎంతో సమస్యగా మారింది. ప్యాసింజరును రద్దు చేయడం విద్యార్థులు, ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లేవారికి ఎంతో ఇబ్బందికరంగా మారింది. గతంలో నడిపిన గుంతకల్లు-ధర్మవరం పాస్ట్ ప్యాసింజరు రైలును పునరుద్ధరిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. **-కే వెంకటేశ్వర్లు, అనంతపురం**

### చిగ్జాజుర్ ప్యాసింజరును ధర్మవరానికి నడపాలి



పెద్దగా ఉపయోగపడని గుంతకల్లు-చిగ్జాజుర్ ప్యాసింజరును మార్చి వరకూ కనీసం గుంతకల్లు-ధర్మవరం మధ్య నడిపితే జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చిగ్జాజుర్ ఈశాన్య రైల్వేలో ఉంది. మన జోన్‌కు, డివిజన్‌కు ఎటువంటి సంబంధంలేని చోటికి రైలును నడిపేబదులు జిల్లాలో నడిపితే మేలు.

**- ఎం వెంకటేశులు, కాంట్రాక్టు లెక్చరర్, గుంతకల్లు**

# అయ్యో.. రైతన్న

## విద్యుదాఘాతంతో మృతి

## కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు



గంగాధర్ (ఫైల్)

ధర్మవరంరూరల్, జనవరి26(ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడద నుంచి పంటను రక్షించుకునే ప్రయత్నంలో రైతు మరణించాడు. పొలం చుట్టూ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో షాక్‌తో మరణించాడు. మండలంలోని మల్లాకాల్వ గ్రామానికి చెందిన రైతు సాకే గంగాధర్ (38) విద్యుదాఘాతంతో ఆదివారం మరణించాడు. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రైతు తనకున్న మూడెకరాల పొలంలో బోరుబావి కింద వేరుశనగ సాగుచేశాడు. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని, పంట పెట్టాడు. ప్రస్తుతం పంట కాపు వచ్చింది. పొలం సమీపంలోని కొండగుట్టల నుంచి రాత్రివేళల్లో అడవి పందులు పంటపై దాడి చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు ఆ రైతు కుటుంబం రోజూ టపాకులు పేల్చుతుండేది. అయినా పంటపై పందులు దాడి చేస్తుండేవి. దీంతో రైతు గంగాధర్ పొలం చుట్టూ విద్యుత్ వైరు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి పొలానికెళ్లాడు. విద్యుత్ స్తంభంసమీపాన జీ వైర్‌తో పొలం చుట్టూ ఉన్న తంతికి కనెక్షన్ ఇచ్చాడు. జీ వైర్‌ను ప్రధానలైన్‌కు తగిలించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి, అక్కడే కుప్పకూలాడు. ఒళ్లంతా కాలిపోయి మరణించాడు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు గంగాధర్ పొలంలో కిందపడి ఉన్న బ్యాటరీ లైటు వెలగడం చూసి దగ్గరకు వెళ్లి చూశారు. గ్రామస్థులు, కుటుంబీకులకు తెలిపారు. ప్రమాద స్థలానికి చేరుకుని కుటుంబసభ్యులు బోరున విలపించారు. రైతుకు భార్య ప్రభావతి, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైతు భార్య ప్రభావతి రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. రోజూ పొలం వద్దకు తనను తీసుకెళ్లేవాడనీ, శనివారమే వద్దని చెప్పి వెళ్లాడంటూ రోదించింది.



పొలంలో మృతదేహం

## ఖాద్రీశుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

కదిరి లీగల్/గాండ్లపెంట/నంబులపూలకుంట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆదివారం కదిరిలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జిల్లా పోర్టు పోలియో జడ్జి కూడా అయిన జస్టిస్ కె. శ్రీనివాస్ రెడ్డికి ఆలయ తూర్పు రాజగోపురం వద్ద సహాయ కమిషనర్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని న్యాయమూర్తి దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. అనంతరం కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయించాలని న్యాయవాదులు.. న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు. న్యాయమూర్తి వెంట స్థానిక న్యాయాధికారి జయలక్ష్మి, డీఎల్ఎస్ఏ శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం గాండ్లపెంట మండలంలోని కటారుపల్లిలో వెలసిన యోగివేమన ఆలయాన్ని హైకోర్టు జడ్జి సందర్శించారు. నంబులపూలకుంట మండలంలోని గూటిబైలు గ్రామ సమీపంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమానును న్యాయమూర్తి సందర్శించారు. ఆలయంలో తిమ్మమాంబ, బాలవీరయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.



జస్టిస్ శ్రీనివాస్ రెడ్డికి ఖాద్రీశుడి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

# దాడుల కలకలం

## ధర్మవరంలో రెచ్చిపోయిన జమీర్ వర్గం

టీడీపీ వర్గీయుల వాహనాలపై రాళ్లు

కిందకు దిగిన వారిపై కర్రలతో దాడి

ఆరుగురికి గాయాలు



ధ్వంసమైన టీడీపీ నాయకుల వాహనాలు

ధర్మవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ నాయకులపై దాడి ఆదివారం కలకలం రేపింది. వైసీపీ నుంచి బీజేపీలోకి చేరనున్న జమీర్ అహమ్మద్‌తోపాటు ఆయన వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఆరుగురికి గాయాలు కాగా.. రెండు వాహనాలు, మరో రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. పట్టణంలోని పదో వార్డులో పల్లవి థియేటర్ సమీపాన అటుగా వెళ్తున్న టీడీపీ నాయకుల వాహనాలపై జమీర్ వర్గీయులు రాళ్లు రువ్వారు. వాహనాలు దిగిన వారిపై కర్రలతో దాడులకు తెగబడ్డారు. దీంతో టీడీపీకి చెందిన షాహీర్, జావీద్, భానుప్రకాశ్, 12 ఏళ్ల చిన్నారి ఉబేష్, చిన్నారు లోకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఉస్మాన్ స్వల్పంగా గాయపడ్డాడు. దాడులతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

### వాహనాలపై రాళ్లు

ధర్మవరంలోని పదో వార్డుకు చెందిన క్రిష్టాపురం జమీర్ అహమ్మద్ వైసీపీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. అదే వార్డుకు చెందిన కొందరు టీడీపీ నాయకులు వాహనాల్లో ఆదివారం మధ్యాహ్నం అటు వైపుగా వెళ్తున్నారు. వాటిపై జమీర్ వర్గీయులు రాళ్లు రువ్వారు. దీంతో టీడీపీ నాయకులు వాహనాలు దిగి, ఎందుకు రాళ్లు వేస్తున్నారని ప్రశ్నించారు. వారు మరింత రెచ్చిపోయారు. ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో వాహనాలను ధ్వంసం చేశారని బాధితులు తెలిపారు. తమను చుట్టుముట్టి కర్రలతో దాడి చేశారన్నారు. ఆ సమయంలో పోలీసులు అక్కడే ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డామని వారు తెలిపారు. అక్కడి నుంచి పోలీసుల సాయంతో స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే టీడీపీ శ్రేణులు భారీగా చేరుకుని, అండగా నిలిచారు. అనంతరం గాయపడిన వారిని ధర్మవరం ఆస్పత్రికి తరలించి, బందోబస్తు మధ్య చికిత్సలు నిర్వహించారు.

### వైసీపీ హయాంలోనూ..

గత వైసీపీ హయాంలోనూ జమీర్ వైసీపీలోకి చేరి తమపై దాడి చేసినట్లు టీడీపీ వర్గీయులు పేర్కొంటున్నారు. జమీర్ వర్గీయులు సుదీర్ఘకాలం టీడీపీలో కొనసాగారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాది ముందే టీడీపీని వీడి, ఆ పార్టీలో చేరారు. వైసీపీలోకి చేరిన నెల వ్యవధిలోనే టీడీపీకి చెందిన ముగ్గురు ముస్లింలపై విచక్షణారహితంగా దాడి చేశారు. అప్పట్లో కేసు కూడా నమోదు చేయలేదని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. వైసీపీ హయాంలో టీడీపీని ఇబ్బందులకు గురిచేసిన క్రిష్టాపురం జమీర్ బీజేపీలో చేరేందుకు సిద్ధమవడాన్ని టీడీపీ వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీని ఇబ్బందులకు గురిచేయడమేకాకుండా భౌతిక దాడులకు పాల్పడిన జమీర్, ఆయన కుటుంబసభ్యులను కూటమిలోని బీజేపీలోకి ఎలా చేర్చుకుంటారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమ వినతిని ఖాతరు చేయటంటూ టీడీపీ వర్గీయులు రగలిపోతున్నారు.



టీడీపీ నాయకులు వాహనాలపై దాడులు చేస్తున్న వైసీపీ వర్గీయులు

### భారీ బందోబస్తు

టీడీపీ వర్గీయులపై దాడులు పట్టణంలో కలకలం రేపాయి. టీడీపీ వర్గీయులు వేలాది మందిగా తిరుగుబాటుకు రంగం సిద్ధం చేశారు. పరిస్థితిని పసిగట్టిన డీఎస్పీ హేమంత్‌కుమార్ ప్రత్యేక బలగాలను మోహరించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చిస్తూ పరిస్థితిని గాడిన పెట్టడంలో సఫలీకృతులయ్యారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్, ఆస్పత్రి వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడి విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఎల్ నరేంద్రచౌదరి, పరిశే సుధాకర్, నాగూర్ హుస్సేన్, పోతుకుంట లక్ష్మన్న, ఫణికుమార్, పురుషోత్తం గౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవ రెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకున్నారు.



దాడిలో గాయపడిన లోకేశ్, షామీర్, జావీద్, భానుప్రకాశ్

## శోభాయమానంగా శాంతి సద్భావన యాత్ర

అనంతపురం కల్చరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ 286వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం రెండో రోడ్డులోని బంజారా భవన్ నుంచి చేపట్టిన శాంతి సద్భావనయాత్ర శోభాయమానంగా సాగింది. అంతకుముందు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయక్ మాట్లాడారు. గిరిజనులకేకాక అన్ని సామాజిక వర్గాలవారికి శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం శాంతి సద్భావన యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర పురవీధులగుండా సాగింది. బంజారాల సంప్రదాయం ఉట్టిపడేలా వేషధారణలు, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ శేఖర్ బాబు, ఆలిండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ నాయక్, చక్రే నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.



యాత్రను ప్రారంభిస్తున్న భక్తులు..



రథంలో ప్రత్యేక అలంకరణలో సంత్ సేవాలాల్ మహరాజ్

# హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు

## గణతంత్ర దినోత్సవాన పస్తులు

## సీకే పల్లి బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్



బీసీ హాస్టల్లో మధ్యాహ్న భోజనం అందక ఆకలితో ఉన్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీకే పల్లి బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్న భోజనం అందలేదు. మోడల్ స్కూల్, ఉన్నతపాఠశాలకు చెందిన 3 నుంచి పదో తరగతి వరకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. గణతంత్ర వేడుకలకు ఉదయం వెళ్లి.. మధ్యాహ్నం 12 గంటలకు హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్ వంటగదికి తాళం వేసి ఉండటంతో చాలా సేపు వేచి చూశారు. డబ్బులున్న కొందరు హోటల్‌కు వెళ్లి భోజనం చేశారు. మరికొందరు పార్శిల్ తెచ్చుకుని తిన్నారు. డబ్బులు లేనివారు ఆకలితో అలమటించారు. వార్డెన్ నారాయణస్వామి నింపాదిగా సాయంత్రం 4 గంటలకు హాస్టల్‌కు వచ్చారు. తమకు మధ్యాహ్న భోజనం పెట్టలేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బడిలో పెట్టలేదా అని ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ధర్మవరం ఆర్డీఓ మహేష్, తహసీల్దారు సురేశ్ కుమార్ హాస్టల్‌కు వెళ్లి విచారించారు. వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ వ్యవహారశైలి బాగా లేదని, మద్యం తాగి వస్తుంటారని స్థానికులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల ఉపాధ్యాయులు, వార్డెన్ మధ్య సమన్వయం లేకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉండాల్సి వస్తోందని అన్నారు. దీంతో విషయాన్ని ఆర్డీఓ కలెక్టర్ టీఎస్ చేతన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వార్డెన్ నారాయణస్వామిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి తెలిపారు.

### మంత్రి సవిత ఆగ్రహం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నుంచి కలెక్టర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి సరికాదని అన్నారు. వార్డెన్‌పై చర్యలకు ఆదేశించారు. విచారించి, నివేదిక ఇవ్వాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ధర్మవరం ఆర్డీఓ మహేశ్

## టమోటా కిలో రూ.14

అనంతపురం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.8 పలికినట్లు ఆయన తెలిపారు.

అనంతపురం





జేడీఏ ఉమామహేశ్వరమ్మ



ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి

కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

# సేవకు ఉత్తమ పురస్కారం

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ అధికారులుగా, ప్రైవేట్ వ్యక్తులుగా ఉత్తమ సేవలు అందించిన వారికి రిపబ్లిక్‌డే సందర్భంగా ఆదివారం పురస్కారాలు అందజేశారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతపురం జిల్లాలో 290 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 561 మంది పురస్కారాలు అందుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

శ్రీ సత్యసాయి



కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు



పరపాటి సువర్ణ ఆర్డీఓ, పుట్టపర్తి



నరసింహారావు ఉద్యానశాఖ; డ్వామా పీడీ సలీం బాషా; శిరీష, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్; శ్రీదేవి, సీడీపీఓ ఉరవకొండ; కేశవనాయుడు, ఆర్డీఓ; ఆనంద్, కలెక్టర్ డీపీఎం; వాణిశ్రీ తహసీల్దార్; రామప్ప, జూనియర్ అసిస్టెంట్

అహమ్మద్ అలీ, జూనియర్ అసిస్టెంట్; వీరనాగప్ప, కలెక్టర్ పీఎస్‌ఓ; భవాని విలేజ్ సర్వేయర్; అనిల్‌కుమార్, టీఏ; భూషణం, డీఏఓ వజ్రకరూరు; ప్రొఫెసర్ సతీష్ మెడికల్ కాలేజ్; డీవీ రమణ మూర్తి, ఏఎస్పీ; ఇలియాజ్ బాషా ఏఎస్పీ

శ్రీనివాసరావు అనంత డీఎస్పీ; శ్రీనివాసులు గుంతకల్లు డీఎస్పీ; రవిబాబు కళ్యాణదుర్గం డీఎస్పీ; నీలకంఠారెడ్డి ఏఆర్ డీఎస్పీ; ధరణి కిశోర్ సీఐ; శేఖర్, సీఐ; నీలకంఠేశ్వర, సీఐ; క్రాంతికుమార్ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్

హరినాథ్, సీఐ; వెంకటేష్ నాయక్, సీఐ; విజయభాస్కర్ రాజు, ఎస్‌ఐ; టీపీ వెంకటస్వామి, ఎస్‌ఐ; జాఫర్, ఆర్‌ఎస్‌ఐ; వరుణాచారీ, ఏఎస్‌ఐ; పద్మ కానిస్టేబుల్; ఆంజనేయప్రసాద్, ఎస్పీ సీసీ

రాకేష్, జూనియర్ అసిస్టెంట్; ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్; శ్రీవిద్య, డాక్టర్; అన్నపూర్ణ, ఎక్సైజ్ సీఐ; వేణుగోపాల్, బీసీ వెల్ఫేర్; సతీష్, బీసీ వార్డెన్; శారద, ఎస్సీ వెల్ఫేర్ వార్డెన్; సునీత, ఎంవీఐ; రవి, హౌసింగ్ వాచ్‌మన్

షబ్రీన్, కార్మికశాఖ; భాస్కర్ నాయుడు, పీసీ; పక్కీరయ్య, మత్స్యశాఖ; సురేఖరాణి, ఏడీసీసీబీ; రజియాబేగం, మహిళా సమాఖ్య; హరిప్రసాద్, అవార్డు గ్రహీత; రమేష్‌నారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్; అక్బర్ సాహెబ్, నేత్ర వైద్యుడు; సుదర్శన్‌రావు, జేఎన్‌టీయూ వీసీ

రమణారెడ్డి, సంజీవని; అలంబన జనార్దన్; ప్రమీలమ్మ, ఏజీఎస్; లెనిన్‌బాబు, సమాజసేవ; సాయి, సమాజసేవ; యుగంధర్ రెడ్డి, క్రికెటర్; నాగరాజు కానిస్టేబుల్; డాక్టర్ మమత జేఎన్‌టీయూ



విజయ్‌కుమార్ డీఎస్పీ పుట్టపర్తి; బాలసుబ్రహ్మణ్యంరెడ్డి స్పెషల్‌బ్రాంచ్ డీపీఓ; ప్రదీప్‌కుమార్, స్పెషల్‌బ్రాంచ్ డీపీఓ; టి ఆనందకుమార్ ఆర్డీఓ, పెనుకొండ; వీవీఎస్ శర్మ ఆర్డీఓ, కదిరి; విజయ్‌కుమార్ ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్; వైవీ సుబ్బారావు వ్యవసాయ అధికారి; చంద్రశేఖర్, ఉద్యాన అధికారి

సుదర్శన్, మైక్రో ఇరిగేషన్ అధికారి; పద్మమ్మ, జాయింట్ డైరెక్టర్ సెరికల్చర్; శుభదాసు, పశుసంవర్ధక శాఖాధికారి; చంద్రశేఖర్‌రెడ్డి మత్స్యశాఖాధికారి; టీ.చక్రపాణి, జిల్లా అటవీశాఖాధికారి; మల్లికార్జునరావు భూగర్భజలవనరుల శాఖాధికారి; నరసింహమూర్తి మార్కెటింగ్ అధికారి; వంశీకృష్ణారెడ్డి, జిల్లా సివిల్‌సప్లై అధికారి

అశ్వర్థనారాయణ నాయక్ మేనేజర్; డాక్టర్ తిప్పేంద్రనాయక్ జిల్లా కోఆర్డినేటర్; శ్రీదేవి జిల్లా కోఆర్డినేటర్ ఎన్టీయార్ వైద్యసేవ; కే నరసయ్య డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్; విజయేంద్రప్రసాద్ డ్వామాపీడీ; హరికృష్ణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి; శివరంగప్రసాద్ సాంఘికసంక్షేమ అధికారి; మోహన్‌రాం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి

నిర్మలాజ్యోతి బీసీ సంక్షేమశాఖ; కృష్ణప్ప విద్యాశాఖాధికారి; మురళీ మోహన్ పీఆర్ ఇంజనీర్; మల్లికార్జునప్ప ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి; సురేంద్ర, ఎస్‌ఈ ఏపీఎస్పీడీసీఎల్; వై. సమత జిల్లా పంచాయతీ అధికారి; వెంకటనారాయణ గృహనిర్మాణశాఖ; విజయశాంతిబాయి సర్వే ల్యాండ్ రికార్డ్స్

వేలాయుధం డీపీఆర్‌ఓ; టి హేమంతరెడ్డి అగ్నిమాపకశాఖ; సుధాకర్‌రెడ్డి నోడల్ అధికారి జీఎస్‌డబ్ల్యూఎస్; నరసింహమూర్తి పబ్లిక్‌హెల్త్ ఇంజినీరింగ్; కృష్ణానాయక్ కో ఆపరేటివ్ అధికారి; నాగరాజు, పరిశ్రమల శాఖ; శ్రీనివాసులు కమిషనర్ హిందూపురం; కిరణ్ కుమార్ మున్సిపల్ అధికారి, కదిరి

రామకృష్ణ జిల్లా చేనేత టెక్స్‌టైల్స్ అధికారి; డాక్టర్ పీఎస్ మంజువాణి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ; జయమ్మ ల్యాబ్ టెక్నీషియన్ ధర్మవరం; సాయిమనోహార్ ధర్మవరం ఎంపీడీఓ; శ్రీనివాసులు ఏడీ బత్తలపల్లి; రామాంజనేయులు ఎస్టీ హెడ్ కానిస్టేబుల్ రామగిరి; లక్ష్మీనారాయణ, పీఆర్, డీఈ



ఆంధ్రజ్యోతి అనంతపురం కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భగేల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాప్తాడు సర్పంచ్ తిరుపాలు

## నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అనంతపురం టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం కొనసాగుతుందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరవుతారని, సమస్యలున్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## టీడీపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలు





జాతీయ జెండా ఆవిష్కరణకు హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## తొలిసారి ఏడీసీసీబీ శకటం



ఏడీసీసీ బ్యాంకులో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పర్సన్ ఇంచార్జి జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ



ఏడీసీసీ బ్యాంకు శకటం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు చరిత్రలో తొలిసారి గణతంత్ర దినోత్సవాలలో శకటాన్ని ప్రదర్శించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా సీఈఓ సురేఖరాణి అవార్డు అందుకున్నారు. ఎన్టీఆర్ సహకార భవన్‌లో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ శివనారాయణ శర్మ జాతీయ జెండాను ఎగురవేశారు.

## త్యాగధనుల ప్రతిఫలం గణతంత్రం: సీఎఫ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది త్యాగధనుల ప్రతి ఫలం ఈ గణతంత్రం అని సీఎఫ్(కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) యశోదాబాయి పేర్కొన్నారు. స్థానిక అటవీశాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకల్లో సీఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవం గురించి వివరించారు.

## అద్భుత ప్రదర్శనలు

పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవాలలో వివిధ శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. దిశ పోలీసు విభాగం, అగ్నిమాపక శాఖ శకటాలను ప్రదర్శించాయి. వ్యవసాయ, పశుసంవర్థక శాఖలు తమ పరిధిలోని పథకాలను తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించాయి. విద్య, విద్యుత్ శాఖ, డ్వామా, అటవీ, ఏడీసీసీబీ, నగర పాలక సంస్థ, అహుడా, రెడ్‌క్రాస్ శకటాలు ఆకట్టుకున్నాయి. పోలీసు రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్‌కు విద్యార్థులు, కురుగుంట, కూడేరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం కేజీబీవీ విద్యార్థులు పామిడి వీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అనంతపురం విశ్వభారతి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ శకటానికి ప్రథమ బహుమతి, నగరపాలక సంస్థ శకటానికి ద్వితీయ బహుమతి, ఏడీసీసీబీ శకటానికి తృతీయ బహుమతి లభించాయి. స్టాల్స్‌లో హార్టికల్చర్ శాఖ మొదటి బహుమతి, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ రెండో, మూడో బహుమతి అందుకున్నాయి. మార్చ్‌ఫాస్ట్‌లో ఆర్‌ఎస్‌ఐ జాఫర్ బృందం మొదటి బహుమతి, ఉమెన్ కంటింజెంట్ ఎస్ భారతి బృందం ద్వితీయ బహుమతి, అగ్నిమాపకశాఖ బృందం తృతీయ బహుమతి అందుకున్నాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



మొదటి బహుమతి అందుకున్న వైద్యఆరోగ్య శాఖ శకటం

# 290 మందికి ఉత్తమ అవార్డులు

## అట్టహాసంగా పురస్కారాల ప్రదానం

అనంతపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పలువురికి అవార్డులు అందించి, అభినందించారు. జిల్లా ఉన్నతాధికారుల కేటగిరిలో ఏడుగురికి ఉత్తమ అవార్డులను అందజేశారు. వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు 257మందికి ఉత్తమ అవార్డులు అందజేశారు. ప్రైవేటు రంగంలో సామాజిక సేవలను గుర్తించి 26మందికి కలెక్టర్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ జగదీష్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ రాయదుర్గం కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, నగరమేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, నగరప్రజలు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న ఎస్పీ కానిస్టేబుల్ ఎస్ ధనుంజయ

### అవార్డుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు

ఉత్తమ అవార్డు ఎంపిక జాబితాపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో చేంతాడంత జాబితాను ప్రకటించేవారు. ఈసారి జాబితాను కుదించడం పట్ల హర్షం వ్యక్తం అయ్యింది. ఎంపికైన కొందరి విషయంలో అధికారులు తప్పు చేశారేమోనన్న భావనలు వ్యక్తమయ్యాయి. డ్వామా, డీఆర్‌డీఏ, వైద్య, రెవెన్యూశాఖలలో అవినీతి, అక్రమాలు మూటగట్టుకుని, శాఖాపరమైన చర్యలు తీసుకున్నవారికి అవార్డుల జాబితాలో అవకాశం కల్పించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. డ్యూటీకే రాని మహిళా డాక్టరుకు అవార్డుల జాబితాలో చోటు కల్పించడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్వచ్ఛంద సేవా రంగాలలో 26మందికి ప్రైవేట్ ప్రతినిధులకు అవార్డులు ప్రకటించగా అందులో ఒకసంస్థకు చెందిన మహిళకే రెండుసార్లు అవార్డుల జాబితాలో పేర్లు ప్రకటించారు. రాజకీయపార్టీలలో ఉంటూ విమర్శలు ఉన్నవారికి అవార్డులు ఇవ్వడంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



పురస్కారం అందుకుంటున్న ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర

### ఆకట్టుకున్న జేసీ, అసిస్టెంట్ కలెక్టరు

గణతంత్ర దినోత్సవంలో జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న ఆకట్టుకున్నారు. జేసీ రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఆయన ఆ రాష్ట్ర సంప్రదాయం ప్రకారం తలకు పాగా పెట్టుకొని వేడుకలకు హాజరుకావడం అందరినీ ఆకట్టుకుంది. మనరాష్ట్రానికి చెందిన బొల్లినేని వినూత్న పదహారణాల తెలుగమ్మాయిలా చీరకట్టుకొని వేడుకల నిర్వహణను పర్యవేక్షించడం ఆకట్టుకుంది.

## క్రైం న్యూస్ ..

### రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


ముఖేష్ నాయక్ (ఫైల్)

ముదిగుబ్బ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఈ ప్రమాదాలు జరిగాయి. అడవి బ్రాహ్మణపల్లి తండా సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి అదే తండాకు చెందిన మోహన్‌నాయక్ కుమారుడు ముఖేశ్‌నాయక్ (15) మరణించాడు. ముఖేశ్ ముదిగుబ్బలో ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండేవాడు. శనివారం ఆ తండాకు సమీపంలోని మారెమ్మగుడికి బైక్‌లో బయ లుదేరాడు. ఆలయ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి తీవ్ర కడుపు నొప్పి రావడంతో.. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

● పొడరాళ్లపల్లి సమీపంలో...


హరినాథ్ (ఫైల్)

ముదిగుబ్బ మండలంలోని పొడరాళ్లపల్లి సమీపంలో ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడటంతో.. మంగళ మడక గ్రామానికి చెందిన హరినాథ్ (33) అక్కడికక్కడే మరణించాడు. అతను ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బ నుంచి స్వగ్రామమైన మగళమడకకు వస్తుండగా.. మార్గ మధ్యంలో పొడ రాళ్లపల్లి వద్దకు రాగానే బైక్ అదుపు తప్పింది. దీంతో కింద పడిని అతనికి తీవ్ర గాయాలు గావడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. హరినాథ్ అనంతపురంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనిక భార్య లత ఉన్నారు. వీరికి సంతానం లేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

### గడ్డివాములకు ఆకతాయిల నిప్పు

ధర్మవరం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి గ్రామ సమీపంలో భైరవుడి గుడి వద్ద ఆదివారం రైతు నరేంద్రకు చెందిన రెండు గడ్డివాములకు ఆకతాయులు నిప్పు పెట్టడంతో అవి ఆహుతయ్యాయి. బాధిత రైతు నరేంద్ర మాట్లాడుతూ పాడిపశువులకు ఇటీవల గడ్డిని కొనుగోలు చేశామని, ఎవరో ఆకతాయులు నిప్పుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రూ.1.50 లక్షలు నష్టపోయామని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

### బంగారు నగల చోరీ

నల్లమాడ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామ వాసి రత్నమ్మకు చెందిన నాలుగు తులాల బంగారు నగలు ఆదివారం చోరీ అయ్యాయి. డి.చెర్లోపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డులో రత్నమ్మ దుకాణం నిర్వహిస్తోంది. కదిరి వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో ఆదివారం ఆమె దుకాణం వద్దకు వచ్చారు. వాటర్‌బాటిల్ కావాలని అడగ్గా.. ఫ్రిజ్‌లో నుంచి వాటర్ బాటల్ తీసి ఇవ్వబోయింది. వారు ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు చైన్ లాక్కొని.. నల్లమాడ వైపు ద్విచక్రవాహనంలో వెళ్లిపోయారు. ఆమె ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు.

### నల్లచట్టాలను రద్దు చేయాలి : సీఐటీయూ



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ధర్మవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మికులకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న నల్ల చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్ లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన వారు మాట్లాడారు. ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీ ర్యం చేయడానికి, ప్రైవే టీకరణ పెంచడానికి, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వాలు యత్నిస్తున్నాయన్నారు. అనంతరం అంబే ద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎల్ ఆది నారాయణ, అంగన్ వాడీ యూనియన్ నాయకురాలు సరస్వతి, ఫాతిమా, దీన, పోతక్క, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.


డ్రైనేజీ లేక రోడ్లపై పారుతూ మడుగును తలపిస్తున్న మురికినీరు

# వెనుకబడిన కాలనీ..!

రాజకీయ చైతన్యం కలిగిన గ్రామం కొత్తచెరువు. మేజర్ పంచాయతీ అయిన కొత్తచెరువు.. శ్రీసత్యసాయి జిల్లాలో కేంద్రంలో ఓ భాగం. కొన్నేళ్లుగా వేగంగా విస్తరిస్తోంది. ఈ ఊరి బీసీ కాలనీ ఇరవై ఏళ్ల కిందట చిన్నగా ఏర్పడి.. ఇప్పుడు ఓ ఊరును తలపిస్తోంది. పేరుకే బీసీ కాలనీ, కానీ అన్ని వర్గాల ప్రజలూ ఇక్కడ కలిసిమెలిసి జీవిస్తున్నారు. మూడు దశల్లో పేదలకు ఇంటి స్థలాలను కేటాయించారు. దీంతో రెండు వేలకు పైగా ఇళ్లు నిర్మితమయ్యాయి. ఐదు వేల జనాభా ఉంటోంది. ఇంతటి కీలకమైన కాలనీలో మాత్రం మౌలిక సదుపాయాలు లేవు. ప్రతి ఏటా ఇంటి స్థలా పట్టాల పంపిణీతో కాలనీ మరింత విస్తరిస్తోంది. అందుకు తగినట్లుగా రోడ్లు, తాగునీరు, విద్యుత్, వైద్యం తదితర మౌలిక వసతులు కల్పించాలి. కానీ ఆ దిశగా చర్యలు లేవు. ప్రభుత్వాలు మారిన కాలనీలో పరిస్థితులు మెరుగుపడలేదు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి/కొత్తచెరువు

### మౌలిక వసతులు కరువు


దారి ఇలా ఉంటే.. నడిచేదెలా..?

బీసీ కాలనీలో ఇరుకైన రహదారులు ఉన్నాయి. డ్రైనేజీ కాలువలు లేవు. దీంతో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. దుర్వాసనతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఎటు చూసినా మట్టి రోడ్లు కనిపిస్తాయి. మురుగునీటితో అధ్వాన స్థితికి చేరాయి. జనం రోగాల బారిన పడుతున్నారు. ఈ కాలనీకి సమీపంలో బుక్కపట్నం చెరువు ఉంది. చెరువులో నీరు పుష్కలంగా ఉన్నా, కాలనీలో తాగునీటి ఎద్దటి నెలకొంది. తాగునీటి సమస్య తీర్చేందుకు వేణుగోపాల్ నగర్‌లో గత ప్రభుత్వం హయంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. కానీ పైపులైన్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. కాలనీ శివారులో విద్యుత్ లైన్లు లేవు. కట్టెలు నాటి.. వైర్లను లాక్కున్నారు. అవి ప్రమాదకరంగా మారాయి. వర్షాలు, గాలికి వైర్లు తెగిపోతుండటంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయంలో ఏర్పడుతోంది. గంటల తరబడి చీకట్లో మగ్గే పరిస్థితి ఉంది. ఇళ్లపై హైటెన్షన్ విద్యుత్ లైన్‌లు ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.


బీసీ కాలనీలో ఎటుచూసినా మురుగునీరే...


కాలనీలో మట్టి రోడ్డు




- వెనుకబడిన కాలనీ..!
- మట్టి రోడ్లపై మురుగు నీరు
- వర్షాకాలంలో మడుగులను తలపిస్తాయి
- చెరువు పక్కనే ఉన్నా.. తాగునీరు కొనాల్సిందే
- కర్రలే విద్యుత్ స్తంభాలు.. ప్రమాదకరంగా వైర్లు
- కొత్తచెరువు బీసీ కాలనీలో మౌలిక వసతులు కరువు

### కట్టెలపై విద్యుత్ వైర్లు : వడ్డే నాగమణి


కట్టెల విద్యుత్ స్తంభాలే గతి



టీడీపీ హయాంలో పేదలకు కొండ ప్రాంతంలో ఇంటి స్థలాలను కేటాయించారు. అక్కడ ఇళ్లను నిర్మించుకున్నాం. కానీ కాలనీకి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయలేదు. అర కిలోమీటరు దూరం నుంచి మా ఇంటికి కట్టెలను నాటుకుని కరెంటు వైరును ఏర్పాటు చేసుకున్నాం. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. కరెంటు వైరు కొనేందుకు అప్పు చేయాల్సి వచ్చింది. అధికారులు స్పందించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి.

### నీటిని కొంటున్నాం: పద్మ



ఎల్-2, ఎల్-3 కింద ఇంటి స్థలాల పట్టాల ఇచ్చిన కాలనీలకు మంచినీటి కోసం పైపులైన్ ఏర్పాటు చేయలేదు. తాగునీటిని కొనుగోలు చేస్తున్నాం. వారానికి ఒకసారి వెయ్యి రూపాయలు ఇచ్చి ట్యాంకర్లను తెప్పించుకుంటున్నాం. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. కూలీ డబ్బులు ఇంటి ఖర్చులకు, పిల్లల చదువులకే సరిపోతున్నాయి. తాగునీటి సమస్యను తీర్చాలి.

### రోడ్లపైనే మరుగునీరు..: రామాంజినమ్మ



బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురుగునీరు రోడ్లపైకి వదులుతున్నారు. రోడ్డుపై నడవడానికి తీవ్ర అసౌకర్యంగా ఉంది. ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉంటోంది. దుర్వాసన వస్తోంది. దోమలు ప్రబలుతున్నాయి. విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, డ్రైనేజీ కాల్వలను నిర్మించాలి.

### మట్టి రోడ్లే..: సియూబ్



బీసీ కాలనీ మూడు దశల్లో విస్తరిస్తోంది. మొదటి దశలో కాలనీలో ఏర్పాటు చేసిన రోడ్లే తప్ప.. విస్తరించిన ప్రాంతాల్లో రోడ్లు లేవు. మట్టి రోడ్లపైనే వెళుతున్నాం. అధికారులను అడిగినా సీసీ రోడ్లు ఏర్పాటు చేయలేదు. వర్షాకాలంలో రోడ్లు నీటి మడుగులను తలపిస్తాయి. విద్యుత్ స్థంబాలు కూడా లేవు. అర కిలోమీటరు నుంచి కట్టెలపై వైర్లను లాక్కున్నాం.

### బాలకృష్ణ సేవలకు గుర్తింపే పద్మభూషణ్ : ఎమ్మెల్యే

పుట్టపర్తి టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించే పద్మభూషణ్ పురష్కారాన్ని ప్రకటించిందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘు నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తిలో వారు మీడియాతో మాట్లాడుతూ.. బాలకృష్ణ సినీ నటుడుగా, రాజకీయ నాయకుడిగానే కాకుండా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్ హోదాలో వేలాదిమంది బడుగులకు సేవలు అందించారన్నారు.

### భారీ భద్రత

ధర్మవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆది వారం జరిగిన రాజకీయ ఘర్షణల నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేసేలా డీఎస్పీ హేమంత్ కుమార్ చర్యలు చేపట్టారు. ఇరువర్గాల ఘర్షణ కారణంగా పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అదనపు పోలీసు బలగాలను మోహరింపచేశారు.

### ప్రమాద బీమా చెక్కు అందజేత

ధర్మవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గానికి చెందిన ఈరన్న ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతను జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకొని ఉండటంతో అతనికి ప్రమాద బీమా వర్తించింది. దీంతో బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షలు మంజూరైంది. ఆ చెక్కును మంగళగిరిలోని పార్వతి కల్యాణ మండపంలో మంత్రి నాదెండ్ల మనోహర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ సమక్షంలో ఈరన్న కుటుంబసభ్యులకు ఆదివారం అందజేశారు.


పుట్టపర్తి : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జెండా వందనం


ధర్మవరం రూరల్ : బసవన్నకట్ట వీధిలో త్రివర్ణ అలంకరణలో త్రిలింగేశ్వరుడు


ఓడీసీ : విజ్ఞాన్ పాఠశాల విద్యార్థుల ర్యాలీ

## కన్నుల పండువగా గణతంత్ర దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లా కేంద్రంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను కన్నుల పండుగగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తిలోని జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్, ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ వీ రత్న, జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఆర్డీఓ కార్యాయంలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ విజయ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నీలకంఠారెడ్డి.. జాతీయ జెండాను ఎగురవేశారు. పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లిలోని వారధి స్కూల్ విద్యార్థులు కొత్తచెరువులో 150 అడుగుల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు. ధర్మవరంలోని బసవన్నకట్ట వీధిలో త్రిలింగేశ్వరుడు త్రివర్ణపతాకం అలంకరణలో దర్శనమిచ్చారు. కదిరి కోర్టులో న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి జెండాను ఆవిష్కరించారు.


ముదిగుబ్బ : జాతీయ జెండాతో విద్యార్థుల విన్యాసం


కొత్తచెరువు : 150 అడుగుల పొడవు జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ


పుట్టపర్తి : ఎస్పీ క్యాంపు కార్యాలయంలో..


పుట్టపర్తి : కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్


కదిరి: కోర్టు ఆవరణలో న్యాయాధికారి జయలక్ష్మి


ధర్మవరం : డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ హేమంత్‌కుమార్


తాడిమర్రి : నిడిగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద..

న్యూస్ బాక్స్

## అల్లుకున్న నిర్లక్ష్యం



హిందూపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పరిగి మండలంలోని సేవా మందిరం నుంచి మోదా వైపు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభానికి పచ్చని తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారింది. తీగలు స్తంభానికున్న వైర్లను తాకి చెట్లపొదలకు కరెంటు ప్రసరిస్తేవాటిని తాకినవారికి షాక్ కొట్టడం ఖాయం. ఈ నిర్లక్ష్యంపై ట్రాన్స్‌కో ఈఈ దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ స్తంభానికి చెట్లు తొలగిస్తామన్నారు.

## గ్రామ సచివాలయాలపై ఎగరని మువ్వన్నెల జెండా



సచివాలయం వద్ద జెండా లేక బోసిపోయిన స్తంభం

గోరంట్ల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఊరంతా త్రివర్ణపతాకాలు ఎగురవేస్తుంటే గోరంట్లలోని సచివాలయ సిబ్బందికి మాత్రం అందుకు తీరుబాటుకాలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోరంట్లలో ఎమ్మార్సీ వద్ద సచివాలయం -5, మార్కెట్‌లోని సచివాలయం 4, గ్రామ చావిడిలోని సచివాలయం -2లో ఆదివారం జెండా ఎగరలేదు. కార్యాలయం ముందు ఉన్న పతాకావిష్కరణ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు, జెండా లేకుండానే బోసిపోయి కనిపించాయి.

ఇటీవల మంత్రి సవిత అధికారుల సమీక్షా సమావేశంలో సచివాలయ సిబ్బంది పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడిన విషయం తెలిసిందే. అయినా వారిలో మార్పురాకపోవడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దీనిపై పంచాయతీ ఇఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ వేడుకలు ఒకేచోట ఘనంగా నిర్వహించడం కోసం సచివాలయం -1 వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమానికి పలువురు సచివాలయ సిబ్బంది గైరుహాజరవడం గమనార్హం.

## ఆటోలో మంటలు... హడలెత్తిన జనం



ఆటోలో మంటలను ఆర్పుతున్న దృశ్యం

హిందూపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నడిబొడ్డున ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఆటోలో మంటలు చలరేగాయి. అక్కడున్నవారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆటోలో మంటలు వస్తుండటంచూసి అక్కడున్నవారు కేకలు వేయడంతో ఆటో డ్రైవర్ ఆపేశాడు. పక్కనే ఉన్న హోటల్‌లో బిందెలో నీరు తెచ్చి మంటలను ఆర్పారు. అయితే రద్దీగా ఉండే ప్రాంతంలో ఆటోలో మంటలు చలరేగడంతో అక్కడున్నవారు హడలెత్తారు. ఎక్కడ ఆటోలో మంటలు వ్యాపిస్తాయోనని సమీప ద్విచక్రవాహనాలను దూరంగా తీసుకెళ్లారు. అక్కడున్నవారు స్పందించి మంటలు ఆర్పేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## పార్టీని బలోపేతం చేయండి



బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న పార్థసారథి

హిందూపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ అన్నారు. ఆదివారం హిందూపురానికి విచ్చేసిన సందర్భంగా ఆయనను స్థానిక నాయకులు సత్కరించారు. బీజేపీ తిరుపతి ఇన్‌చార్జి పార్థసారథి నివాసంలో జీఎం శేఖర్‌ను సత్కరించారు. అదేవిధంగా బీజేపీ కార్యవర్గ సభ్యులు రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ అంజలినికూడా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు వరప్రసాద్, ఆదర్శ్, నగేష్, ఉదయ్, రవితేజరెడ్డి, తిరుమలేష్, మేడకుర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో నిర్వాహకులకు ఎస్‌ఐ కౌన్సెలింగ్

సోమందేపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి):ఆటో నిర్వాహకులకు ఆదివారం ఎస్‌ఐ రమేష్ కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వారిని స్టేషన్‌కు పిలిపించి పలు సూచనలుచేశారు. విద్యార్థులను పాఠశాలకు తరలించే ఆటో నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వేగం నియంత్రిస్తూ నడపడమేకాకుండా యూనిఫాం ధరించాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో సత్యసాయి నగర సంకీర్తన

చిలమత్తూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కోట్లోపల్లి గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సత్యసాయి బాబా నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మూర్తి ముందుగా ప్రశాంతి పతాకావిష్కరణ చేశారు. అనంతరం భక్తులకు సాయి బాబా సేవలు, మహిమల గురించి వివరించారు. బాబా సూచించిన మార్గాన్ని ప్రజలు ఆచరించాలన్నారు. అనంతరం గ్రామంలో సాయిబాబా చిత్రపటాన్ని భజన సంకీర్తనలతో ఊరేగించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ శంకరనారాయణ, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ ఆచారి, మండల సమితి కోఆర్డినేటర్ గిరీష్, భజన మండలి కన్వీనర్ గోవిందప్ప, రామయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

# జయ జయ జయహే!

మాజీ సైనికుల ఆఫీసులో..



బాల జాతీయ నేతలు



మడకశిరలో..



హిందూపురం : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వాడవాడలా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణ , రూరల్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వెంకటేశ్, మునిసిపల్ ఆఫీసులో కమిషనర్ శ్రీనివాసులు జెండాను ఎగురవేశారు. పోలీస్ స్టేషన్‌లలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్‌కరీంలు జెండా వందనం చేశారు.

న్యాయాధికారుల ఆధ్వర్యంలో..



హిందూపురం కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరించిన జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ, పాల్గొన్న న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

పెనుకొండలో..



పెనుకొండ కోర్టు ఆవరణలో న్యాయాధికారులు, న్యాయవాదుల ఆధ్వర్యంలో పతాకవందనం



ఎంపీ కార్యాలయంలో పతాక వందనం చేస్తున్న కమలమ్మ, టీడీపీ నాయకులు

అమరాపురంలో..



అమరాపురం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మారుతీప్రకాష్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పరిగిలో..




పరిగిలో జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు

పావగడలో..



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్

## మహనీయుల స్ఫూర్తి భావితరాలకు అందాలి

● వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి) మహనియుల స్ఫూర్తి, భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని ఏఆర్ రొప్పం గ్రామంలో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ భావితరాలవారు మహనీయులను గుర్తించుకోనే విధంగా వారి విగ్రహాలను ఏర్పాటుచేయాలన్నారు. మడకశిర పట్టణంలో కూడా వడ్డెఓబన్న విగ్రహం ఏర్పాటుకు తాను అన్నీ విధాల సహకారం అందిస్తాన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి సారిగా వడ్డెర్లు అందరూ కలసి వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుచేయడంతో తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం వడ్డెర్ల నాయకులను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పావగడ ఎమ్మెల్యే వెంకటేష్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షులు అంజనప్ప, జనసేనా మండల అధ్యక్షులు శివాజీ పాల్గొన్నారు.

**బాలయ్యకు పద్మభూషణ్ రావడం ఆనందదాయకం**

పద్మభూషణ్ అవార్డు కళారంగంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు దక్కడం కళామతల్లికి దక్కిన గౌరవం అని టీటీడీ బోర్డు సభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిలు అన్నారు. స్థానికంగా విలేకరులతోమాట్లాడుతూ ఆయన తన నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకొన్నారన్నారు. అదేవిధంగా ఏబీసీడీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన నరేంద్రమోడీ చేత శభాష్ అనిపించుకొన్న మందకృష్ణమాదిగకు పద్మశ్రీ దక్కడం చాలా సంతోష దాయకం అని ఎమ్మెల్యే అన్నారు.



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

## కష్టానికి దక్కిన ప్రతిఫలం పద్మభూషణ్

● పురంలో బాలకృష్ణ అభిమానుల సంబరాలు

హిందూపురం, జనవరి26 (ఆంధ్రజ్యోతి):కళారంగం, సేవాకార్యక్రమాల్లో తనదైన ముద్రవేసుకున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం ఆయన కష్టానికి దక్కిన ఫలితమని టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు అన్నారు. ఆదివారం హిందూపురం పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద బాణసంచా పేల్చారు. భారీ కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు మాట్లాడుతూ ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా ఉంటూ లక్షలాది మంది ప్రాణాలను కాపాడిన మహోన్నత వ్యక్తి బాలయ్య అని అన్నారు. ఆయన తన జీవితంలో ఎన్నో విజయాలు తన సొంతం చేసుకున్నారని, 67ఏళ్ల వయసులో కూడా కుర్రాడిగా నటిస్తూ అభిమానులను అలరిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న బాలకృష్ణ సినీరంగంలో ఒక లెజెండరీ అన్నారు. ఆయనకు మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, అమర్నాథ్, ప్రెస్‌వెంకటేశ్, ఆర్ఎంఎస్ షఫీ, బండారుబాలాజీ, హెచ్ఎన్ రాము, మంగేష్, రామాంజినమ్మ, నాగేంద్ర, యుగందర్, అమీన్ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు

## దాడి కేసులో నిందితుడికి రిమాండు

పెనుకొండ టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): శివమాలవేసుకున్న ఆటో డ్రైవర్ శ్రీనివాసులపై దాడిచేసిన ఘటనలో నిందితుడు దాదును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఆదివారం రిమాండుకు తరలించారు. శనివారం సాయంత్రం దర్గాసర్కిల్‌వద్ద చిన్న వివాదంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సాయంత్రం నుంచి తెల్లవారుజామున 2గంటల వరకు హిందూసంఘాలు నిరసన, ధర్నా కార్యక్రమాలను చేపట్టాయి. తొలుత దర్గాసర్కిల్, ట్యాంక్ సర్కిల్‌వద్ద నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో సమస్య ఉధృతం కావడంతో జిల్లా ఎస్పీ రత్న సమస్యను సీరియస్‌గా తీసుకుని అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌ను సంఘటనా స్థలానికి పంపారు. ఈ క్రమంలో దాడిచేసిన వ్యక్తి వచ్చి క్షమాపణచెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటికే దాదును సోమందేపల్లిలో అరెస్టుచేసి స్టేషన్‌లో ఉంచారు. అయినా సమస్య కొలిక్కి రాకపోవడంతో జాతీయరహదారిని దిగ్బంధం చేసేందుకు వెళ్తుండగా ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ఆదివారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఫిబ్రవరి 3వరకు రిమాండుకు ఆదేశించారు.

**శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు: మంత్రి సవిత**

పెనుకొండ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ నుంచి ఆమె ఓ ప్రకటన విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం ఆటో డ్రైవర్ శ్రీనివాసులు, దాదుల మధ్య జరిగిన సంఘటన అనుకోకుండా జరిగిందేనని, దీనిని కుల మతాలకు ఆపాదించవద్దని, అందరూ సంయమనం పాటించాలని మంత్రి కోరారు. పెనుకొండలో జరిగిన ఘటన బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా దాడికి పాల్పడితే తమ పార్టీవారినైనా ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. పెనుకొండకు ఓ ప్రత్యేక ఉందని అన్ని కులాలు, మతాలు అతీతంగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్నారన్నారు. శ్రీబాబయ్యస్వామి ఉరుసైనా, వినాయక చవితి అయినా కలిసి మెలిసి చేసుకుంటారన్నారు. ఒకరిద్దరి మధ్య జరిగిన ఘటన కారణంగా కులాలు, మతాల్లో అలజడి రేపవద్దని మంత్రి కోరారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్టు తెలిపారు.

**దాడి దురదృష్టకరం: ఎంపీ**

పెనుకొండ పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకున్న సంఘటన దురదృష్టకరమని ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ పెనుకొండ పట్టణం ప్రశాంతతకు, సర్వమతాలకు మారుపేరని, ఇక్కడి ప్రజలు కులమతాలకు అతీతంగా అన్నదమ్ములా కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. పెనుకొండకు కియా పరిశ్రమ వచ్చింది, మరెన్నో పరిశ్రమలు వచ్చి అభివృద్ధిచెందే తరుణంలో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. తప్పుచేసిన వారు ఎవరైనా పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నానన్నారు.

## వెనుకబడిన వర్గాలను విస్మరించిన జగన్

● జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణ



మడకశిర టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో జగన్ వెనకబడిన వర్గాలను విస్మరించి తన కుటుంబ బంధువుల లబ్ధి కోసమే ఆరాటపడ్డారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ ఆరోపించారు. మడకశిరకు ఆదివారం వచ్చిన సందర్భంగా ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వెనకబడిన సామాజిక వర్గాల వారి ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వడ్డే ఓబన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించేందుకు జీవోను కూడా విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివాజీ, జనసేన నాయకులు ఉన్నారు.

## బ్రిటీష్ వారిని ఎదిరించిన వారే ఆదర్శం



జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

మడకశిరటౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రం కోసం ఆనాడు బ్రిటీష్ పాలకులను ఎదిరించి కొందరు ధైర్యంగా ముందుకుసాగారని, దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించిన ఆ మహానుభావులను ఆదర్శంగా తీసుకొని అందరం ముందుకు సాగుదామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలాజీనగర్ టీడీపీ పార్టీ కార్యాలయం ఆవరణంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాను భావుల పోరాట పటిమను గుర్తు చేసుకొన్నారు. భారత పౌరులందరికీ సమాన హక్కులు కల్పిస్తూ ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ రూపొందించుకొన్న రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు రిపబ్లిక్ డే అన్నారు. అదేవిధంగా మడకశిర పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాల, పట్టణంలోని వివిధ పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. శ్రద్ధ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో పాఠశాల వ్యవస్థాపకుడు రాధాకృష్ణ జెండాను ఆవిష్కరించారు. మాతా ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా మైనారిటీ అధ్యక్షులు భక్తర్, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, క్లష్టర్ ఇన్‌చార్జి నాగరాజు పాల్గొన్నారు.

## తాడు మెడకు చుట్టుకుని బాలుడికి అస్వస్థత

గోరంట్ల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనాయునిపల్లికి చెందిన గణేష్ అనే ఏడు సంవత్సరాల బాలుడు మెడకు తాడుచుట్టుకుని ఆదివారం అస్వస్థతకు గురైయ్యాడు. శ్రీనివాసులు కుమారుడైన గణేష్ ఇంటిలో ఆడుకుంటుండగా, వేలాడుతున్న తాడు మెడకు చుట్టుకోవడంతో విడిపించుకోలేక అస్వస్థతకు గురయ్యాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు పిల్లవాడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆస్పత్రికి తరలించారు.